# కడుపు మంట కొడుతుందా ?

కొడుతుందనే నమ్మకం కలిగింది నాకు, మానవ శక్తి మీద ఎక్కువా, సెంటిమెంటు మీద తక్కువా విశ్వాసం గల నాకు ఒక చిన్న సంఘటనతో ఈ రకమైన నమ్మకం కలగటం మామూలు విషయం కాదుగదా !

★ ★ ★

16, ఏప్రిల్ సాయంత్రం, మద్రాస్ కెళ్లే మెయిల్లో రాజమండ్రి నించి ఏలూరొస్తున్నాను. స్పాట్ వాల్యుయేషన్‌లో పేపర్లు దిద్ది దిద్ది అలిసిపోయున్నానేమో నా సీట్లోనే నేను మాగన్నుగా కునికి పాట్లు పడుతున్నాను. నిడదవోల్లో ఒక సేట్జీ నా కాలు తొక్కుకుంటూ రావటంతో ఈ లోకంలో కొచ్చాను. నేను కూర్చున్నది ఫోర్‌సీటర్ మధ్యలో . నా కెదురుగా ఉన్న ఫోర్ సీటర్లో కిటికీ దగ్గర అప్పటిదాకా కూర్చోనున్న ఎర్రచొక్కా అసామీ అక్కడ లేడు. ఆ ఖాళీలోకి డబాయింపుగా వచ్చి కూర్చోబోయాడు సేట్జీ. ఆ పక్కనున్నాయన, " ఇక్కడ మనిషున్నాడు, వస్తాడు " అన్నాడు.

సేట్జీ " క్యా? తెల్గూ నై మాలూమ్!" అంటూ డబాయింపుగా కూర్చుండిపోయాడు. మరు నిముషంలో పాయిఖానా నించి ఎర్రచొక్కా ఆసామి వచ్చాడు. సేట్జీ హిందీలో మాట్లాడుతుంటే , ఈ అసామీ తెలుగులో మాట్లాడుతున్నాడు. చివరికి సేట్జీ నెగ్గాడు. అక్కణ్ణుంచి లేవలేదు. ఎర్రచొక్కా ఆసామి ఆ ఫోర్ సీటర్లోనే ఇరుక్కొని ఎట్లాగో కూర్చున్నాడు.

ప్లాట్ ఫారం మీద కూల్ డ్రింకు లమ్ముతున్న బండి కిటికీ దగ్గర కొచ్చింది. ఆ అమ్మే కుర్రాడు డ్రింకుల పేర్లన్నీ ఏకరువు పెట్టాడు. " ఐస్ కోల్డ్ సార్, ఐస్‌కోల్డ్!" అన్నాడు.

సేట్జీ వాడితో " మజా కిత్‌నా?" అన్నాడు. " ఢాయీ రూపయా (రెండున్నర రూపాయలు) సాబ్" అన్నాడు డ్రింకులకుర్రాడు.

" బాప్‌రే, ఢాయీ రూపయా! జాదా రేట్ హై! (చాలా ఎక్కువ రేటు) " అంటూ సేట్జీ తన జేబులోంచి రెండు రూపాయల నోటు తీశాడు. కిటికీ లోంచి ఆ నోటు వాడి కందిస్తూ " ఏక్ దో" అన్నాడు.

ఆ కుర్రాడు ఆ రెండు నోటు అందుకుని జేబులో వేసుకున్నాడు. మాజాసీసా ఐస్ బాక్స్‌లోంచి ఎత్తి కార్క్ తీసి సేట్జీకి అందించాడు. బండి తోసుకుంటూ, అరుచుకుంటూ పక్కకెళ్లాడు.

సేట్జీ తాగుతున్నాడు తాగుతున్నాడు తాగుతూనే ఉన్నాడు. బయట గార్డు ఈల వినిపించింది. చటుక్కున డ్రింకులకుర్రాడు ప్రత్యక్షమయ్యాడు సీసాకోసం కిటికీలోంచి చెయ్యిచాచాడు. సేట్జీ విధిలేక విడిచి పెడుతున్నటు సీసాని బయటకందించాడు. తాపీగా వెనక్కు అనుకుని కూర్చుండిపోయాడు. డ్రింకుల కుర్రాడు కంగారుగా " అరణా దేదో సాబ్!" అన్నాడు. మళ్లీ అన్నాడు. మళ్ళీఅన్నాడు.

బండి కదిలింది. సేట్జీలో చలనం లేదు.డ్రింకుల కుర్రాడు చేత్తో సేట్జీని పొడిచాడు. అవైపు చూస్తూ గద్గద స్వరంతో " బుడ్డి అమ్మితే పావలా వస్తుంది సార్! అరుగురిని పోషించాల్సార్! ఎన్ని బుడ్లమ్మితే అళ్ళకి గంజయినా పొయ్యగల్నుసర్! ఇయ్యాల పొద్దుట్నించీ పాతిగ్గూడా అమ్మలేదు సార్, సార్ మీరయినా చెప్పి అర్ధరూపాయి ఇప్పించండి సార్!" అన్నాడు.

మిగతా మేమెవ్వరం మాట్లాడలేదు డబాయించి సీటు దోపిడీ చేసినప్పుడే సేట్జీ సంగతి తెలిసినప్పుడు ఇప్పుడింక ఎవరైనా మాట్లాడేదేముంది? అయినా అసలు చాలా మంది ఎవరి ధ్యాసలో వాళ్ళున్నారు

బండి కొద్దిగా వేగం అందుకుంది ఆ కుర్రాడు బండితో బాటే నడుస్తున్నాడు. సేట్జీని పొడుస్తూ తిట్లు అందుకున్నాడు. " దొంగలల్లం కొడకా! బండి కదిలేదాకా తాగి తాగి డబ్బెగ్గొడతావంట్రా ! దొంగనాయాలా! నీకన్నా ప్లాట్‌ఫారం కుక్కల్నయంరా ! థూ. ఏం బతుకురా నీది ! నిన్ను తగలెయ్య.." బండి స్పీడు ఇంకా పెరిగింది బండితో పాటు పరిగెత్తి పరిగెత్తి ఇహ పరిగెత్తలేక కిటికీ వదిలేశాడు అ కుర్రాడు సరిగ్గా అప్పుడే మా పెట్టె ప్లాట్‌ఫారమ్ దాటింది

అంతవరకూ పరధ్యానంగా ఉన్న వాళ్లందరికి అసలేం జరిగిందో బుర్రకెక్కేటప్పటికే జరగవలసింది జరిగిపోయింది. నాకు మాత్రం మౌనంగా కూర్చో బుద్ధికాలేదు. జరిగిన అన్యాయానికి నాపక్కనాయనతో నేను " వాడుముందరే ధర చెప్పాడు గదా! మరీయన రెండే ఇచ్చి ఊరుకోవటం ఎంత అన్యాయమో చూడండి!.. . ఏమాత్రంసంస్కారమూ, సభ్యతా ఉన్నవాడైనా వాడల్లా దారుణంగా తిడుతూంటే వింటూ కూర్చోగలడా, ఈయన కూర్చున్నాడు గానీ? " అన్నాను.

వెంటనే నా మాటలు అర్థమైనట్టు సేట్జీ ముందుకు వంగీ హిందీలో బడబడాఏదో అనేశాడు. దాని సారాంశం- " నారెండు నోటు అందుకొని ఆ తరువాత నాకు బుద్ధి ఇచ్చాడు. అంటే, రెండు రూపాయలకు ఒప్పుకున్నట్లేగదా? మరి తరవాత మాట మార్చి వచ్చి అర్ధరూపాయి ఇమ్మంటే సహిస్తామా? బండి ఆగుంటే చెప్పేవాణ్ణి వాడికి బుద్ధి!"

నేనూ హిందీలోనే అన్నాను. " మీరు రెండిచ్చి సీసా అందుకున్నారు నిజమే కానీ మిగిలిన అర్ధా ఇవ్వనని చెప్పలేదే. వాడికా విషయం ఎట్లా తెలుస్తుంది? వాడు స్పష్టంగా రెండున్నర అని చెప్పాడు గదా! మిగిలిన చిల్లర తరువాత ఇస్తారనే ఆశతోనే వాడు సీసా మీ కందించాడు ... పోనీ ఇది చెప్పండి, మీరు బేరమాడితే రెండుకే సీసా ఇచ్చేవాడా మీకు ? ప్లాట్ ఫారం కంట్రాక్టర్లు మనను బేర మాడనిస్తారా?"

ఈ వాదనతో సేట్జీ పేట్రేగిపోయాడు. అన్నాడు : " ఆ సీసాలో నీళ్ళ ఖరీదు అసలు అర్ధరూపాయి. దానికే నా దగ్గరనుంచి రెండు గుంజాలని చూశాడు ఇంతకన్నా ద్రోహం ఉందా! అయినా ఆ అర్ధకేరూపాయిన్నర కలిపి రెండిచ్చాను. ఇంకెంతివ్వాలి? దొంగలం- కొడుకు! ఇదే మా బెజవాడలో అయితేనా వాడి మొదటి తిట్టుకే తవ్వి పాతేద్దును హ(..! దోపిడీ అండీ! అంతా దోపిడీకోరులే! సంఘ విద్రోహులు!"

నాపక్కవాళ్ళూ, ఎదుటివాళ్లూ ఎవళ్ళూ మా సంభాషణలో కల్పించుకోలేదు నేను ఒంటరివాణ్ణైపోయాను సేట్జీ చూడబోతే రెచ్చిపోతున్నాడు ఇంతింత జబ్బలతో ఉన్న ఆ మనిషి గనక కోపంతో ఒక్కగుద్దు గుద్దాడంటే నేను హరీ మనాల్సిందే!

కనక తెలివిగా వాదనను ఒక్క మాటతో తుంచేశాను. " మీ రెన్ని చెప్పండి వాడి తప్పొప్పులు. డ్రింకు అసలు ఖరీదు తరువాత మీరు అర్ధరూపాయి ఇవ్వకపోవడం మాత్రం నమ్మకద్రోహమే!"

నేనూహించినట్టే సేట్జీ ఇంకా పెచ్చరిల్లిపోయాడు ఏదేదో వాగాడు నేనింకేమీ పట్టించుకోలేదు చివరకతనే ఊరుకుండిపోయాడు నేను ఏలూర్లో దిగిపోయాను వీడికి భగవంతుడు తగినట్టుగా బుద్దిఎప్పుడు చెబుతాడో గదా!" అనుకుంటూ

17 ఏప్రిల్‌న - అంటే పై సంఘటన జరిగిన మర్నాడు ఉదయం నేను మామూలుగానే ఏలూర్లో

మద్రాసు నుంచొచ్చే మెయిల్ ఎక్కాను రాజమండ్రి వెళ్ళేందుకు. ఊపిరాడనంత తొక్కిడిగా ఉంది అట్లాగే ఎక్కి నుంచున్నాను. తాడేపల్లిగూడెంలో టి టి ఇ. ఎక్కాడు. టిక్కెట్లు చెక్ చేసుకుంటూ నావెనక నుంచొచ్చాడు. నన్ను దాటుకుని ముందు కెళ్ళాడు. హఠాత్తుగా అతని గొంతు వినిపించింది. హిందీలో ఏదో 'చేప' దొరికి నట్టుంది. ఆ 'చేప' కూడా యథాశక్తి వాదించింది. సంభాషణంతా హిందీలో సాగింది.

"నో...నో... ఈ టిక్కెట్టు మొన్నటిది 15 వ తారీఖుది. మెడ్రాస్ సెంట్రల్ టు రాజమండ్రి ఇదిగో ఒకటీ అయిదూ కనిపిస్తుంటే నిన్నటి దంటారేంటి?"

"అదేంటి సార్. జనతాకని నిన్న పొద్దున్న సెంట్రల్లో తీసుకున్నాను. తారీఖెంతేశారో నా కెందుకు సార్! పొద్దున్న ఏడు గంటలకి తీసుకున్నాను. బుకింగుక్లర్కు డేట్ మార్చటం మరిచిపోయి పదిహేను15 గానే ఉంచి దీని మీద కొట్టి ఇచ్చుండొచ్చు గదా!"

"మీరు చెప్పింది జరగటం చాలా అరుదు. పోనీ అట్లాగే అనుకున్నా ఈ తారీఖు కచ్చితంగా పదిహేనే. మీరు మొన్నటి టిక్కట్టుతో నిన్న చెయ్యవలసిన ప్రయాణం ఇవ్వాళ చేస్తున్నారు. దీనర్థం డేట్ బార్ అయిన టిక్కెట్టు మళ్ళీ వాడుతున్నారు."

ఆ 'చేప' న్యాయంకోసం పక్క ప్రయాణీకులను హిందీలో అర్థిస్తున్నాడు. "చూడండి సార్ జనతాకని నిన్న పొద్దున్న తీసుకున్నాను. మెడ్రాస్ సెంట్రల్లో. తొమ్మిదింటికి జనతా ఎక్కాల్సింది ఎక్కలేకపోయాను. రాత్రి పదింటికి ఈ మెయిల్ ఎక్కాను. నేను పెద్దమనిషిని. నన్ను చూసైనా అర్థం చేసుకోవచ్చుగాదా! టి టి ఇ గారిట్లా వేధిస్తారేంటి? మీరు చెప్పండి సార్. ఆ డేటు 16 కాదా? నాతప్పేంటసలు?"

ఇంతలో అవతలి వైపునుంచీ మరో టి టీ ఇ. వచ్చాడు. అంటే, చెరొకవైపునించీ ఇద్దరెక్కారన్న మాట! అతను, "అల్ రైట్ తప్పు చెయ్యని వాళ్లని పట్టుకోడం మా కానందం కాదు. రాజమండ్రిలో ఇన్‌స్పెక్టర్‌ను అడిగి తేలుస్తాంలెండి" అన్నాడు.

ఆ తొక్కిడిలో వాళ్లముగ్గురిలో ఎవరి మొహం నాక్కనిపించలేదు. కానీ ఎందుకో నాకు కిందటి నాయంత్రం నాటి సేట్జీ జ్ఞాపకానికొచ్చాడు. కానీ వెంటనే నాధ్యాస ఇంకేదో విషయం వైపు మళ్ళిపోయింది.

చాలా కచ్చితంగా తొమ్మిదింబావుకల్లా మెయిల్ రాజమండ్రి స్టేషన్లో ఆగింది. ఆలస్యం చేస్తూ తాపీగా నావైపు నుంచి నేను పెట్టె దిగి నాదోవన నేను పోబోయాను. అప్పటికే ఏ.ఎస్.ఎమ్. ఆఫీసు దగ్గర వాళ్ళ ముగ్గురే కాబోలు ఇంకో ఇద్దరు టి టీ ఇలతో కలసి నుంచుని టిక్కెట్టును పరిశీలిస్తున్నారు.

"నో...నో... ఇది కచ్చితంగా మొన్నటిదే 15 నాటిదే..." అంటున్నాడొకడు.

"పోన్లెండి,ఏదో ఈ సారికి వదిలేద్దాం. మనవాళ్ళు మాత్రం నిక్కచ్చిగా ఉండేడుస్తున్నారా ఏంటి! నిద్రమత్తులో డేట్ మార్చలేదనీ గ్యారంటీ ఏంటి?" అంటున్నాడు ఇంకోడు.

నేను అగాను పరాకాయించి చూశాను. సందేహం లేదు. నాఅనుమానమే నిజం. ఆ ప్రయాణీకుడు ఆ 'చేప' వాడు... వాడు... వాడు ఆ సేట్జీయే!

ఒక్కసారిగా వణుకు మొదలై ముందర నా కాళ్ళలోంచి. ఆ తరువాత వెన్నెముకలోంచి పాకి తలకెక్కింది. రక్తం సర్రుమని కళ్ళకెక్కేసింది. 'వీడే కదూ నిన్న డ్రింక్స్ వెండర్ని మోసం చేసింది? తినీ తినకా ఆ కంట్రాక్టరెవడో వాడి దయమీద ఆధారపడి బతికే ఆ సన్యాసిని సంఘవిద్రోహిగా చిత్రించబోయింది? వీడేగదా ఎవరిదో సీటు బహిరంగంగా దోపిడీ చేసి ఇంకొణ్ణి దోపిడీకోరుగా చూపించబోయింది? వీడా పెద్దమనిషి? పెద్ద సంఘ విద్రోహి కదూ! దొరికాడు రాస్కెల్!...' ఇలా

అనుకుంటూ అటువైపు నడిచాన్నేను.

సేట్జీ నన్నస్సలేం చెయ్యక్కర్లేదు. ఆ సాయంకాలం నాస్పాట్ వాల్యుయేషన్ కాలేజీ ముందర కాచి ఈడ్చి నన్ను లెంపకాయ కొడితే చాలు నా ఇంటికెళ్లేది ఇహ నా చావుకబురే. నేను కాదు. అయినా సరే. ' అన్యాయం చూస్తూ ఊరుకోవటం కూడా అన్యాయమే కదా! దీన్ని సహించకూడదు' అనిపించింది.

ఇంకో రెండడుగులు ముందుకేశాను. ఒక టి. టి.ఇ. తో అన్నాను. " సార్ నేను లెక్చరర్ని ఇక్కడికి స్పాట్ వాల్యుయేషన్‌కు రోజూ సీజన్ మీదొస్తున్నాను. ఇదిగో నా సీజను (చూపించాను) ఈ పెద్దమనిషి నాతో కలిసి నిన్న - అంటే 16న సాయంత్రం ఇక్కణ్ణించే మెయిల్లో ప్రయాణించాడు. నేను ఏలూర్లో దిగిపోయాను. ఈయన బెజవాడ వెళ్లాడనుకుంటాను."

ముందర తెల్లబోయారు ఆ టి టి.ఇ.లు! ఒక టి.టి. ఇ. వెంటనే అన్నాడు "థాంక్యూ! థాంక్యూసార్, థాంక్యూ ఫర్ ది కో-ఆపరేషన్!... ప్రయాణీకుల్లో మీబోటి నిజాయితీ పరులున్నారని తెలుస్సార్. అందుకనే ఇందాకటినుంచీ ఈయన విషయంలో ఎటూ తేల్చుకోలేక పోతున్నాం."

సేట్జీ ఏడుపు మొహం పెట్టేశాడు. నావైపు తిరిగి తెలుగులో అచ్చ తెలుగులో శుద్ధమైన తెలుగులో " మీరనుకొంటున్న మనిషి నేను కాద్సార్! నన్ను చూసి ఎవరనుకుంటున్నారో? సరిగ్గా చూడండి.... అయినా నేను మీకే మపకారం చేశాన్సార్ ఇట్లా చెప్పారు!" అన్నాడు.

నాకావేశం పొంగింది. "షటప్! నువ్వు అపకారం చేసింది నాక్కాదు. రెక్కలమ్ముకొని బతికే ఆడ్రింక్ వెండరికి. అంటే ప్రతి కష్టజీవికీని! వాళ్లమీద ఆధారపడి జీవించే ప్రతి మనిషికీ అందరికీ అందరికీని! ఆ వెండర్ ఇంకెప్పుడూ ఎవణ్ణీ నమ్మకుండా ఉండేట్టు ప్రవర్తించావు. సామూహికంగా అన్ని రకాలవాళ్లకి ఒకేసారి గుండె మండించావు! సంఘ ద్రోహి ఎవడు? నువ్వా,వాడా!... పైగా ఈ టికెట్‌లెస్ ట్రావెల్ ఒకటి... స్కౌండ్రల్!"

సేట్జీ అవాక్కయిపోయాడు అతని మొహంలో కత్తివేటుకు నెత్తురు చుక్కలేకుండా పోయింది.

నావైపు చూసిన టి.టి.ఇ. తన పక్కవాడితో అన్నాడు. " రైట్ సుబ్బారావ్ రసీదు పుస్తకం తియ్యవోయ్... మెడ్రాస్ టు రాజమండ్రి నూట అరవై ఎనిమిది రూపాయలు రాయి... హల్లో పెద్దమనిషిగారూ డబ్బు తీస్తారా, బేడీలేయించమంటారా?"

నాకు టైమైపోతోంది. భోంచేసి కాలేజీకందుకోవాలి. కనక నా లంచ్ బాక్సుతో వెయిటింగ్ రూమువైపు నడిచాను. కాని అప్పటికే కడుపు నిండిపోయింది తృప్తితో. అప్పుడే మెదిలింది నా కా కొత్త ఆలోచన, సేట్జీని దెబ్బ కొట్టిందెవరు? ఆ డ్రింక్ వెండర్ కడుపు మంటకాదూ!

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 30-7-86)

★★★ ★★★ ★★★